సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 206 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/21.9°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



కలెక్టరేట్ కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కలెక్టరేట్‌తో పాటు వివిధ శాఖలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఈ క్రమంలో బుధవారం పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ఆర్‌అండ్‌బీ డీఈ ప్రఫుల్లరావు, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఏఈ వన్నూర్‌స్వామి, మండల సర్వేయర్ లక్ష్మీ తదితరులు పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పొలంలో విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. భూమి స్థితిగతులు, సాధ్యాసాధ్యాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. సర్వే నంబర్ 221-1,221-3, 274-1ఎ, 272-2ఎ, 272-1, 273-5లోని 15.72 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలోనే రైతుల నుంచి కొనుగోలు చేసింది.

జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: త్వరలో విజయవాడ వేదికగా జరిగే జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలోని కేజీబీవీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో సుప్రిత, గంగోత్రి, స్పందన, కావ్యశ్రీ, హారిక, వైష్ణవి, భవ్య ఉన్నారు. ఈ నెల 10వ తేదీ గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వీరు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగసుప్రజ, పీఈటీ ఉమ తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను బుధవారం కేజీబీవీ ఉపాధ్యాయులు అభినందించారు.

బీటెక్ ఫలితాలు విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ మొదటి సంవత్సరం ఒకటవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ (అనంతపురం) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

మురి‘పింఛన్’

కులం చూడం.. మతం చూడం.. చివరకు పార్టీ కూడా చూడం.. అర్హులందరికీ పథకాలు అందించడమే తమ లక్ష్యమని చెప్పే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారం చేపట్టినప్పటి నుంచి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ముఖ్యంగా ఏ ఆసరా లేని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతో పాటు కల్లుగీత కార్మికులు, చర్మకారులకు ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నారు. ఈ నెలలోనే జిల్లాలోని 14 వేల మందికి నూతన పింఛన్లు మంజూరు కాగా, లబ్ధిదారుల మోముల్లో ఆనందం వికసిస్తోంది.



- సెప్టెంబర్‌లోనే రెండు విడతల్లో కొత్త పింఛన్లు
- 14,191 వేల మందికి ‘కానుక’ మంజూరు
- రెండో విడతలో పెరిగిన పింఛన్ల పంపిణీ ప్రారంభం
- ఆనందోత్సాహాల్లో నూతన పింఛన్ లబ్ధిదారులు



కుమ్మరివాండ్లపల్లిలో కొత్తగా పింఛన్ అందుకున్న వారితో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటిస్తోంది. దరఖాస్తు చేసుకుంటే చాలు అర్హులందరికీ అందిస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెలలో రెండు విడతల్లో నూతన పింఛన్లు మంజూరు చేసింది. సెప్టెంబర్ 1వ తేదీన తొలి విడతలో 6,176 మందికి, ఈ నెల 12వ తేదీన మరో 8,015 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేసి లబ్ధిదారుల్లో ఆనందం రెట్టింపు చేసింది. సెప్టెంబర్ నెలలో రెండో విడతలో మంజూరైన పింఛన్లను బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు.

నాడు జన్మభూమి కమిటీ సిఫార్సుతోనే పింఛన్..

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మొత్తం రూ.1,000 మాత్రమే ఉండేది. సరిగ్గా ఎన్నికలకు నెల రోజుల ముందు రూ.2 వేలకు పెంచారు. నూతన పింఛన్ మంజూరు కావాలంటే సవాలక్ష ఆంక్షలు విధించేవారు. అప్పట్లో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఆధిపత్యం చలాయించేవారు. పింఛన్‌దారులు టీడీపీ నాయకులను చూసి భయపడేవారు. ఏదో ఒక కారణం చెప్పి తొలగిస్తారన్న అభద్రతా భావంతో ఉండేవారు.

నేడు అర్హత ఆధారంగా ‘వైఎస్సార్ కానుక’

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ మొత్తాన్ని పెంచారు. అలాగే అర్హతే ప్రామాణికంగా నూతన పింఛను మంజూరు చేశారు. సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు అందుబాటులోకి రాగా, వారికి దరఖాస్తు ఇస్తే చాలు ఎవరి సిఫారసు అవసరం లేకుండానే పింఛన్ మంజూరవుతోంది. అలాగే అర్హులు ఎంత మంది ఉన్నా... పింఛన్ ఇవ్వాలని సీఎం జగన్ ఆదేశించడంతో ఏ ఆసరాలేని వారందరికీ ‘కానుక’ అందుతోంది. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారు జామునే వలంటీర్ వచ్చి తలుపుతట్టి ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భారీగా పెరిగిన పింఛన్లు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసింది. ఫలితంగా జిల్లాలో పింఛన్ల సంఖ్య 2,67,516కు చేరుకుంది. ఆగస్టు నెలకు సంబంధించి పింఛన్ల కోసం జిల్లాకు ప్రభుత్వం రూ.72.558 కోట్లు మంజూరు చేయగా, సెప్టెంబర్ మొదట్లో ఆ మొత్తం రూ.74 కోట్లకు చేరుకుంది. తాజాగా 12వ తేదీ రెండో విడతలో 8,015 పింఛన్లకు గాను రూ.2.25 కోట్లు విడుదల చేసింది. దీంతో వలంటీర్లు బుధవారం లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తం అందజేశారు.

ధర్మవరం అర్బన్‌కే అధికం

ఈనెల 1వ తేదీ 6,176 మందికి, 12వ తేదీ 8,015 మందికి మొత్తంగా 14,191 మందికి ఈనెలలోనే ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ మంజూరైంది. రెండో విడతలో మంజూరైన 8,015 మంది లబ్ధిదారులకు బుధవారం నుంచి ‘కానుక’ మొత్తం పంపిణీ ప్రారంభమైంది. నూతన పింఛన్లలో ధర్మవరం అర్బన్‌లో అత్యధికంగా 958 మంది ఉన్నారు. ఆ తర్వాత హిందూపురం అర్బన్‌లో 881 మంది, గోరంట్లలో 582 మంది, కదిరి అర్బన్‌లో 504 మంది, అమరాపురం 481 మందికి పింఛన్ మంజూరైంది.

ఆగస్టులో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు
2,61,340

సెప్టెంబర్ 1వ తేదీ కొత్తగా మంజూరైన పింఛన్లు
6,176

రెండో విడతలో సెప్టెంబర్ 12వ తేదీ మంజూరైనవి
8,015

ప్రస్తుతం జిల్లాలోని పింఛన్‌దారులు
2,75,531

నాలుగేళ్లలో పెరిగిన పింఛన్లు
34,688

సంతోషంగా ఉంది



నా భర్త దూరమయ్యాక కుటుంబ పోషణ చాలా కష్టంగా మారింది. పిల్లల చదువులు, నిత్యావసరాలకు ఇబ్బందిపడుతున్నా. నా పరిస్థితి గమనించి వలంటీర్ వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేసుకోమని చెప్పారు. సచివాలయంలో దరఖాస్తు చేయగా బుధవారం ఇంటికి వచ్చి పింఛన్ మొత్తం అందించారు. ఇదేకదా ప్రజలు కోరుకునేది. ఎవరి సిఫార్సు లేకుండానే పింఛన్ అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.

– వెంకటలక్ష్మి, అమడగూరు

60 ఏళ్లు పూర్తి కాగానే పింఛన్ ఇచ్చారు



నాకు ఇటీవలే 60 ఏళ్లు నిండాయి. వలంటీర్ ద్వారా సచివాలయంలో అన్ని వివరాలతో దరఖా చేసుకున్నా. బుధవారం ఉదయమే నాకు పింఛన్ అందించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే పింఛన్ అందజేయడం ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు. అందువల్లే ప్రజలంతా వైఎస్ జగన్ వెంట ఉన్నారు. – మహబూబ్‌బాషా, పెదపల్లి

ఎప్పటికప్పుడు అర్హుల గుర్తింపు



ఈ ఒక్క నెలలోనే రెండు విడతల్లో దాదాపు 14 వేల పైచిలుకు మందికి కొత్తగా ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ మంజూరు చేశాం. లబ్ధిదారులు చాలా సంతోషంగా ఉన్నారు. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పింఛన్ కానుక అందజేశాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందజేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. ఎప్పటికప్పుడు కొత్త లబ్ధిదారులను గుర్తిస్తూనే ఉన్నాం. ఇది నిరంతర ప్రక్రియ. అర్హత ఉండీ పింఛన్ మంజూరు కాని వారు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. – నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

పోలీసు అనుమతి తప్పనిసరి

- విగ్రహ ఏర్పాటు గురించి స్థానిక పోలీసులకు తెలపాలి
- ఎవరికీ ఇబ్బంది లేని ప్రాంతంలో మంటపం ఏర్పాటు చేయాలి
- వినాయక చవితిని ఆనందంగా జరుపుకుందాం
- జిల్లా ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మంటపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి నిర్వాహకులకు సూచించారు. శాంతి సామరస్యంతో అందరూ వినాయక చవితిని ఆనందంగా జరుపుకోవాలన్నారు. బుధవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు. వినాయక మంటపాలు ఏర్పాటు చేసే వారు ఐదుగురు, అంతకంటే ఎక్కువ మందితో ఓ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏదైనా గుర్తింపు కార్డు చూపించి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రైవేటు, పంచాయతీ, మున్సిపాలిటీ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి స్థల యజమాని నుంచి అనుమతి పొందాలన్నారు. చుట్టుపక్కల వారి నుంచి కూడా సమ్మతి పొందాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల నిబంధనలకు అనుగుణంగా మంటపాల వద్ద ఇసుక, నీళ్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, మార్గం, నిమజ్జన ప్రదేశం, వినియోగించే వాహనాల వివరాలను విధిగా పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే ఉపయోగించాలని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదన్నారు. అలాగే భద్రత కోసం రాత్రి సమయంలో మంటపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపైనా , వాహనాలకు అంతరాయం కలిగేలా విగ్రహాలు ఏర్పాటు చేయకూడదన్నారు. కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేయకూడదని, ఊరేగింపులో రంగులు చల్లడం, మందుగుండు ఉపయోగించకూడదన్నారు. పోలీసులు అనుమతించిన సమయాల్లోనే నిమజ్జనం చేయాలని ఎస్పీ సూచించారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించరాదనీ, నిమజ్జనం సమయంలో వాహనంపై మైనర్లు ఉండకూడదన్నారు. నిమజ్జన సమయంలో భద్రత కోసం వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

- అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపు



సీఎంతో సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: గ్రామీణులకు మరింత మెరుగైన వైద్యసేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తీసుకువచ్చిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం జిల్లాలో ఈనెల 15 నుంచి ప్రారంభం అవుతుందని, అన్నిశాఖల అధికారులు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఉదయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’పై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జేసీ చేతన్‌తో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యుల్లోని ఒకరి మొబైల్‌లో సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేయాలన్నారు. దీంతో పాటు ఆరోగ్యశ్రీ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఈఓ మీనాక్షి తదితరులు మాట్లాడుతూ... జగనన్న ఆరోగ్య సురక్ష మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్య వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న హెల్త్ క్యాంపుల్లో ఉచితంగా మందులు, ఓపీ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీపీఓ విజయ్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. ‘అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా’ అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

శిబిరం చిరునామా:
శ్రీసాయి విద్యానికేతన్ సాయిగీతా స్కూల్, డో.నంబర్ : 2/189, పెద్ద బజారు, పుట్టపర్తి.
ఫోన్ నంబరు : 9912220726

భవిష్యత్తుకు గ్యారంటీ ఏదీ?

నైరాశ్యంలో టీడీపీ శ్రేణులు

- చంద్రబాబు జైలుకు వెళ్లడంపై ఉలుకూ పలుకూ లేదు
- నిరసన దీక్షలకు కార్యకర్తలను బతిమలాడాల్సిన పరిస్థితి
- చంద్రబాబుకు ప్రజల్లో మచ్చుకైనా కానరాని సానుభూతి
- బంద్ విఫలంతోనే బట్టబయలైన పార్టీ దుస్థితి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. పార్టీ అధినేత స్కిల్ స్కాంలో ఇరుక్కుని రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా వెళ్లారు. దీనికి నిరసనగా టీడీపీ బంద్‌కు పిలుపునిస్తే రోడ్డుమీదకు వచ్చి ఆందోళన చేసే వారే కరువయ్యారు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా మంచి చేసిందేమీ లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉండటమే దీనికి కారణమని తెలుస్తోంది. డబ్బులిస్తామన్నా ఆందోళన చేసేందుకు జనం రాకపోవడంతో పార్టీ నాయకుల్లో నైరాశ్యం ఆవహించింది.

కరువైన ప్రజాదరణ

చంద్రబాబును జైలుకు పంపినందుకు నిరసనగా రెండు జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు చేసే అంశంపై చర్చించేందుకు ఈ నెల 12న టీడీపీ నాయకులు అనంతపురంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది కూడా కేడర్ హాజరు కాలేదు. దీంతో రిలే నిరాహార దీక్షలు, వినతిపత్రాలు అందించడం, చంద్రబాబు గురించి గ్రామాల్లో చెప్పడం వంటివి ప్రజాదరణ లేకుండా ఎలా సాధ్యమన్న ఆలోచనలో పడ్డారు. ఉమ్మడి జిల్లాలోని ఏ మండలంలోనూ పట్టుమని పదిమంది కార్యకర్తలు వచ్చే పరిస్థితి కనిపించలేదు. 41 లక్షలపై చిలుకు జనాభా ఉన్న ఉమ్మడి జిల్లాలో నాలుగు వేల మంది కూడా బాబుకు మద్దతు ఇవ్వలేదే అని టీడీపీ నాయకులు మదనపడుతున్నారు.

ఉచ్చు బిగుస్తుండటంతో...

‘స్కిల్’ కుంభకోణంలో చంద్రబాబుకు రోజురోజుకూ ఉచ్చు బిగుసుకుంటోంది. బుధవారం హైకోర్టులో ఏసీబీ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఆర్డర్లను కొట్టి వేయాలని వేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. మరోవైపు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ.. 2014-19 మధ్య జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ ఒప్పందంతో తమకు సంబంధం లేదని తేల్చింది. కంపెనీ ప్రమేయం లేకుండానే దాన్ని చేర్చి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇదొక్కటే కాదు మరిన్ని స్కాములు తెరమీదకు రావడంతో టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముందుకొచ్చి మాట్లాడటానికి జంకుతున్నారు. కిందిస్థాయి కేడర్‌లోనూ, కార్యకర్తల్లోనూ చంద్రబాబు తప్పు చేశారన్న భావన ఉండటంతో ఏ ముఖం పెట్టుకుని రిలే దీక్షలు చేపడతామంటున్నారు.

టీడీపీది ముగిసిన శకం



టీడీపీ పని అయిపోయింది. చంద్రబాబును నమ్మి ఆయన వెంట నడిచేవారు లేరు. కేడర్‌లో ఆందోళన ఉంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే నాయకులెవరో ప్రజలకు తెలుసు. అందుకే కుంభకోణాల్లో ఇరుక్కుని చంద్రబాబు జైలుకెళ్లినా ఎవరూ ఆందోళన చేసే పరిస్థితి లేదు. – డాక్టర్ తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

‘ఆయుష్మాన్ భవ’పై అవగాహన కల్పించాలి

ప్రశాంతి నిలయం: ఆరోగ్యకరమైన భారత్, సామర్థ్యం గల భారత్ నిర్మాణమే లక్ష్యంగా ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ‘ఆయుష్మాన్ భవ’పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ‘ఆయుష్మాన్ భవ’లో రక్తదానం, అవయవదానాలపై ప్రజల అవగాహన కల్పించాలన్నారు. జనవరి వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా వారానికి ఒకసారి పీహెచ్‌సీల్లో ఆరోగ్య మేళా, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంద అవయవ దాన ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, ఐడీ జనరేషన్, ఆరోగ్య పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ తిప్పయ్య, జిల్లా మలేరియా నివారణాధికారి కుళ్లాయప్ప నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


సోమశేఖర్ మృతదేహం

పరిగి: మండలంలోని బీచిగానిపల్లికి చెందిన కురుబ సోమశేఖర్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమశేఖర్‌కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన సోమశేఖర్ బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వ్యక్తగత కారణాలతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి యువకుడి బలవన్మరణం

గుత్తి: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని తురకపల్లి సమీపంలో బుధవారం ఉదయం బేల్దారి శివలింగ (34) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గుత్తిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న శివలింగకు ఇద్దరు భార్యలు, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న శివలింగ కొన్ని నెలలుగా వీపులో నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో నొప్పి తీవ్రత భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఆయన బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న గుత్తి రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గణపయ్య పండుగ.. వైవిధ్య వేడుక

- ఏటేటా రెట్టింపు అవుతున్న 'వినాయక' సందడి
- ఊరూరా కొలువుదీరుతున్న బొజ్జ గణపయ్యలు
- పట్టణాల్లో ఉత్సవ కమిటీల సాయం
- పల్లెల్లో యువత చొరవ
- ఐక్యతకు ప్రతీకగా వేడుకలు


వేడుకకు వేళాయె : గణనాథునికి తుది మెరుగులు దిద్దుతున్న మహిళ

సాక్షి, అనంతపురం డెస్క్: వినాయక చవితి పండుగ అంటే అందరిలోనూ ఉత్సాహం. వేడుకలను వైభవంగా, విభిన్నంగా, గత ఏడాదికి మించి చేయాలనే తపన. పండుగకు పది, పదిహేను రోజుల ముందు నుంచే ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. చందాల వసూలు, మంటపాల నిర్మాణం, డీజే, ఆర్కెస్ట్రా..ఇలా ప్రతి అంశంలోనూ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఒకప్పుడు వేడుకలు ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే జరిగేవి. నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టణాలకు ఏమాత్రమూ తీసిపోకుండా నిర్వహిస్తున్నారు.

యువోత్సాహం..కమిటీల సాయం

గత కొన్నేళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, హిందూపురం పట్టణాల్లో వేలాది విగ్రహాలు కొలువుదీరుతున్నాయి. వీటితో పాటు ద్వితీయశ్రేణి పట్టణాలు, మండల కేంద్రాలు, చివరకు మారుమూల పల్లెల్లో సైతం వీధివీధినా గణనాథులను కొలువుదీర్చి ఆరాధిస్తున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు వేడుకల నిర్వహణలో తగిన సహాయ సహకారాలు అందిస్తున్నాయి. పల్లెల్లో పూర్తిగా యువత ముందుండి నడిపిస్తున్నారు. చిన్నా పెద్ద, పేద, ధనిక, కుల, మతాలకు అతీతంగా అందరినీ వేడుకల్లో భాగస్వాములు చేస్తున్నారు.

సెలవు పెట్టి.. సందడి చేసి

బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్, ఇతరత్రా రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువకులు వినాయక చవితి పండుగ సమయంలో కచ్చితంగా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఉద్యోగాలకు సెలవు పెట్టడమో, కుదరని పక్షంలో వర్క్ ఫ్రం హోం ఆప్షన్‌ను ఎంచుకుని పల్లెల్లో ప్రత్యక్షమవుతున్నారు. ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఇతరత్రా సందర్భాలను కాదనుకుని వినాయక చవితి సమయంలో మాత్రం సొంతూళ్లకు చేరుకుంటున్నారు. వీరంతా ముందుండి వేడుకలు నడిపిస్తున్నారు. వీరి ఉత్సాహాన్ని చూసి స్థానికులు కూడా ప్రోత్సహించడంతో పాటు వేడుకల్లో భాగస్వాములవుతున్నారు.

ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పల్లెల్లో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు వెలుస్తున్నాయి. వీటిలో పది, పదిహేను రోజుల ముందు నుంచే చర్చ మొదలవుతోంది. చందాల వివరాలు, వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లు, ఎవరెవరు ఏయే సహకారం అందిస్తున్నారన్న సమాచారాన్ని అందులో షేర్ చేస్తున్నారు. మంటపాల వద్ద సందడి, నిమజ్జనోత్సవ దృశ్యాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరించి వీడియోలు, ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్నారు. తద్వారా ఇతర ప్రాంతాల్లో ఉంటూ అనివార్య కారణాల వల్ల ఊళ్లకు రాలేకపోతున్న వారికి కూడా ఆనందాన్ని పంచుతున్నారు.

సామాజిక బాధ్యత మరవొద్దు..

పట్టణాలతో పాటు పల్లెల్లోనూ గణేశ్ వేడుకలు వైభవంగా నిర్వహిస్తుండడం శుభ పరిణామం. ఇది ఐక్యతకు, సామరస్యానికి దోహదపడుతోంది. కానీ ఇందులో సామాజిక బాధ్యతనూ విస్మరించరాదు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయి. జలచరాలకు ప్రమాదం ఏర్పడుతోంది. మనుషులకూ కాలుష్యపు పోటు తప్పడం లేదు. కావున ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఆలోచించి మట్టి గణపయ్యలను ఆరాధించాల్సిన అవసరముంది. అప్పుడు మాత్రమే ఈ వేడుకలకు అర్థం, పరమార్థం ఉంటుంది. గణనాథుని చల్లని దీవెనలూ దక్కుతాయి.

మట్టి గణపతే శ్రేష్ఠం



జడ పదార్థమైన భూమి.. చైతన్యం కలిగిన నీళ్లతో చేరినప్పుడు ప్రాణ శక్తి కలుగుతుంది. తద్వారా ఆహార పదార్థాలు, ఔషధులను మనకు అందిస్తుంది. ప్రాణధార, జడశక్తుల కలయికతో సృష్టి ముందుకు సాగుతున్నదన్న సంగతిని చెప్పడానికే గణపతి విగ్రహాన్ని మట్టి, నీరు కలిపి తయారు చేసి, పూజించే విధానం ఏర్పడింది. మట్టి విగ్రహాలనే పూజించమని శాస్త్రమే ఉద్బోధిస్తున్నది. వాతావరణ కాలుష్యం కాకుండా మట్టి విగ్రహాలు ఎంతో మేలు చేస్తాయి. కావున ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ఆరాధించాలి.

– మహేశ్వర శర్మ, శ్రీ బుగరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు

నా చిన్నప్పుడు ఇలా లేదు



నా చిన్నతనంలో ఇలా విగ్రహాలు పెట్టేవారు కాదు. పండుగ రోజు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి.. బంధువులతో సంబరంగా గడిపేవాళ్లం. గౌరీ దేవిని ఏర్పాటు చేసి ఇంట్లో పూజలు చేసేవాళ్లం. పశువులను శుభ్రం చేసి పూజించేవాళ్లం. కానీ కాలం మారింది. యువకులు పెద్దఎత్తున సంబరాలు చేస్తుండడంతో మేము కూడా అందులో పాలు పంచుకుంటున్నాం. – వెంకటేషు, పెదపల్లి, పుట్టపర్తి మండలం

వారం రోజుల సంబరాలు



వినాయక చవితి అంటే వారం రోజుల సంబరాలు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరం విగ్రహాల వద్ద సందడి చేస్తాము. పండుగకు బంధు మిత్రులనూ ఆహ్వానిస్తాము. వినాయక విగ్రహ ఏర్పాటు ప్రస్తుతం చాలా ఖర్చుతో కూడుకున్నది. విగ్రహం, మంటపం ఏర్పాటు, లైటింగ్, షామియానాలు, ఊరేగింపు, ప్రసాదాలు ..ఇలా అన్నింటికీ ఎన్నో ఖర్చులు వస్తాయి. ఇందుకోసం మిత్రులు, గ్రామస్తులతో చందాలు సేకరించి సంబరాలు జరుపుకుంటాము. – మనోహర్‌రెడ్డి, ప్రశాంతిగ్రామం, పుట్టపర్తి మండలం

మామిడిలో 'జల్లెడ' పట్టండి

- ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్


జల్లెడ పురుగు ఆశించడంతో దెబ్బతిన్న మామిడి చెట్టు (ఇన్‌సెట్) మామిడి ఆకును తింటున్న జల్లెడ పురుగు

పుట్టపర్తి అర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలో మామిడిని దెబ్బతీస్తున్న జల్లెడ పురుగు నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు జిల్లా ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జల్లెడ పురుగునే గూడు పురుగు, ఆకుతినే గొంగలి పురుగు అని కూడా అంటారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జల్లెడ పురుగు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పురుగు ఆశిస్తే ఆకులు జల్లెడలా మారి గూడుకట్టుకుని పురుగు ఆకులోనే ఉంటుందన్నారు. కొత్తగా వచ్చే చిగుర్లను తినడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయన్నారు. నివారణ చర్యల్లో భాగంగా పురుగు కట్టిన గూడును పొడవాటి కర్రతో చెదరగొట్టాలన్నారు. అలాగే ఎండిపోయిన ఆకుల గూడులను తొలగించాలన్నారు. అనంతరం లీటర్ నీటికి 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ లేదా 2 మి.లీ నొవాల్యురాన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. 10 రోజుల తర్వాత లీటర్ నీటికి జీవశిలీంధ్రనాశిని బవేరియ బసియానా 5 మి.లీ + మెటార్జియం 5 మి.లీ కలిపి పిచికారీ చేసుకుంటే సమర్థవంతంగా పురుగు ఉధృతిని అరికట్టవచ్చునన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- జిల్లా చీఫ్ కోచ్ ఉదయ్‌భాస్కర్


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఉదయ్‌భాస్కర్, ముఖ్య అతిథులు

మడకశిరరూరల్: విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు జిల్లా చీఫ్ కోచ్ ఉదయ్‌భాస్కర్ సూచించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీరామరెడ్డి 118వ జయంతి సందర్భంగా బుధవారం నీలకంతాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మడకశిర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, గౌరవ వందనం స్వీకరించారు. శ్రీరామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసంతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సేవా మందిరం విద్యాసంస్థల అధినేత కేటీ శ్రీధర్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు పునఃపరిశీలన పక్కాగా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: 'ఓటరు జాబితా సవరణ'ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో అందిన క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు ఆరా తీయాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిర పడిన వారి చిరునామాలు మరోసారి పరిశీలించాలన్నారు. ఇప్పటి వరకూ వచ్చిన అభ్యంతరాలను, రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులను వంద శాతం పునపరిశీలన చేయాలన్నారు. ఫారం 6, 7, 8లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీటీలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల కాపర్ల సంక్షేమానికి ప్రాధాన్యత

- 'షీప్' యూనియన్ సమావేశంలో చైర్మన్ నరసింహగౌడ్


మాట్లాడుతున్న పసుపుల నరసింహగౌడ్

అనంతపురం అగ్రికల్చర్: జీవ సంపద పరిరక్షణ, గొర్రెల కాపర్ల సంక్షేమానికి జగన్ సర్కారు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల యూనియన్ జిల్లా స్థాయి త్రీమెన్ కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్ అన్నారు. అనంతపురంలోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో ఆ యూనియన్ జిల్లా మహాజనసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహగౌడ్ మాట్లాడుతూ... గొర్రెలు, మేకల సంరక్షణకు ఏటా క్రమం తప్పకుండా వివిధ రకాల వ్యాక్సిన్లను ఉచితంగా ఇస్తున్నారని, వ్యాధులు ప్రబలిన సందర్భంలో సకాలంలో వైద్య చికిత్సలు, సలహాలు అందుతున్నాయని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన గొర్రెల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీడీసీ పథకం కింద గతంలో పెద్ద మొత్తంలో తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకున్న వారు కంతుల వారీగా బకాయిలు చెల్లించాలన్నారు. రికవరీలను బట్టి రెండో విడత కూడా ఎన్‌సీడీసీ నుంచి మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని తెలిపారు. గ్రామ స్థాయిలో సొసైటీల ఏర్పాటు, కొత్త సభ్యుల చేరిక, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆ శాఖ ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, సొసైటీల అధ్యక్షులు నల్లప్ప, సంగప్ప, రామాంజినేయులు, రమేష్, మాజీ అధ్యక్షుడు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- పాతిపెట్టిన మృతదేహం వెలికితీత.. పోస్టుమార్టం


మృతురాలు చిట్టెమ్మ

కణేకల్లు: మండలంలోని మండలం సొల్లాపురం గ్రామంలో రెండ్రోజుల క్రితం పాతిపెట్టిన వివాహిత చిట్టెమ్మ (40) మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికి తీయించి, పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో శ్మశానవాటికలోనే పోస్టుమార్టం చేయించారు. పోలీసులు తెలిపిన మేరకు... సొల్లాపురం నివాసి వన్నూరుస్వామికి 25 ఏళ్ల క్రితం బొమ్మనహాళ్ మండలం శిర్పి గ్రామానికి చెందిన చిట్టెమ్మతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ వన్నూరుస్వామి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొన్ని రోజులుగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకుని దంపతులు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చిట్టెమ్మ ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. ఆమె మృతిపై కుటుంబసభ్యులకు అనుమానాలు ఉన్నా.. గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే అంశాన్ని చిట్టెమ్మ తరపు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఉదయం సొల్లాపురం గ్రామ శ్మశాన వాటికకు చేరుకుని పాతిపెట్టిన చిట్టెమ్మ మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, తహసీల్దార్ రజాక్‌వలీ, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డీఈఓ మీనాక్షి


మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

ప్రశాంతి నిలయం: పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారులను డీఈఓ మీనాక్షి ఆదేశించారు. పాఠశాలల నిర్వహణపై అన్ని మండలాల విద్యాధికారులతో బుధవారం కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె సమీక్షించారు. మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద చేట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ, పాఠశాలలో వికలాంగుల చేరికలు, తరగతి గదుల నిర్వహణ, విద్యార్థులు - ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలపై ఆరా తీశారు. పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతి మండలానికి ఇద్దరేసి చొప్పున ఎంఈఓలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో పాఠశాలల నిర్వహణలో ఎక్కడేగాని లోపాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఎంఈఓలపై ఉందన్నారు. ఫిర్యాదు అందితే ఎంఈఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఈలు నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ముద్దాయికి జైలు శిక్ష

హిందూపురం అర్బన్: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ హిందూపురం జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన మైరూల్ అన్సారీ హిందూపురంలోని ఓ ఇనుము విక్రయ దుకాణంలో పనిచేసేవాడు. ఈ క్రమంలో యజమాని బయటకు వెళ్లిన సమయంలో దుకాణంలోని రూ.9 లక్షలు నగదు అపహరించాడు. ఘటనకు సంబంధించి అప్పటి ఒకటో పట్టణ సీఐ ఇస్మాయిల్ కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా నేరస్తుడు మైరూల్ అన్సారీగా నిర్ధారించారు. అనంతరం అన్సారీ సెల్‌ఫోన్ ఆధారంగా నిందితుడి ఆచూకీ పసిగట్టి అరెస్ట్ చేసి, పక్కా ఆధారాలతో న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 8 నెలల జైలు శిక్ష విధితూ మంగళవారం సాయంత్రం తుది తీర్పును న్యాయమూర్తి వెలువరించారు.

జేసీబీ ఢీకొని యువకుడి మృతి


మృతుడు నరసింహులు

తనకల్లు: జేసీబీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం మండ్లిపల్లి నివాసి కొమ్మిద్ది నరసింహులు (38)... అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లిలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తంబళ్లపల్లికి వెళుతున్న ఆయన.. కొక్కంటి క్రాస్ నుంచి బాలసముద్రానికి వెళ్లే మార్గంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన జేసీబీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహులును స్థానికులు వెంటనే చికిత్స కోసం తనకల్లులోని పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, నరసింహులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులంతా క్షేమం


తునాతునకలైన విద్యుత్ స్తంభం

రాయదుర్గం టౌన్: స్థానిక 20వ వార్డు పైతోటలోని మొలకాల్మూరు ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడుపుతూ వేగాన్ని నియంత్రించుకోలేక జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది కాస్త తునాతునకలై పోయింది. బస్సు ముందు భాగంగా దెబ్బ తినింది. డ్రైవర్‌తో పాటు ప్రయాణికులందరూ క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ పైతోట సంజీవప్ప వెంటనే విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి, కరెంట్ సరఫరా నిలిపివేయించారు. విద్యుత్ శాఖ ఏఈ బాలు అక్కడ చేరుకుని పరిశీలించి, దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

కళ్లలో కారం చల్లి చైన్ స్నాచింగ్


బాధితురాలితో ఆరా తీస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్

తాడిపత్రి: మహిళా రైతు కళ్లలో కారం చల్లి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లికి చెందిన దంపతులు కొండేటి వెంకట్రాముడు, అనిత... తాడిపత్రి – అనంతపురం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ పొలాన్ని గుత్తకు తీసుకుని సాగు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం పొలంలో పనులు చేసుకుంటున్న అనిత వద్దకు ఓ ఆగంతకుడు చేరుకుని కళ్లలో కారం చల్లి ఆమె మెడలోని రూ. 2 లక్షల విలువైన 4 తులాల బంగారు గొలుసు లాక్కొని ద్విచక్రవాహనంపై ఉడాయించాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీని పరిశీలించి, ఆగంతకుడి ఆనవాళ్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైద్య సేవలపై కేంద్ర బృందం పరిశీలన


కేంద్ర బృందంతో కొర్రపాడు పీహెచ్‌సీ సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై బుధవారం ఎన్‌క్యూఏఎస్ టీం (నేషనల్ క్వాలిటీ బృందం) సభ్యులు పరిశీలించారు. ముందుగా పీహెచ్‌సీ పరిధిలో ఎన్ని గ్రామాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎంత మందికి వైద్య సేవలు అందుతున్నాయని ఆరా తీశారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ఓపీ విభాగం, ఐపీ విభాగం, ప్రసూతి, ల్యాబొరేటరీ, హెల్త్ ప్రోగ్రాం, జనల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగాలను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న సేవలపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీలో న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన డాక్టర్ సుబ్రజ్యోతిరావు, ఆశాబక్షి ఉన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, జిల్లా క్వాలిటీ టీం సభ్యులు స్టీఫెన్, కొర్రపాడు డాక్టర్లు శ్రీహర్ష, డాక్టర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.